

# అగ్రహారం కథలు

వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - ***రచయిత్రి(బెంగుళూరు)***

## ఆయుర్ (జీవన) వేదం

**తెల్లవారకుండానే సంధ్యావందనం** చేసుకుని తెల్లటి మల్లెపూవుల్లాంటి పంచె, లాల్చీలు వేసుకుని తన మందుల సంచీలు తీసుకుని సువేగా మీద బయలుదేరుతారు అవధానులు గారు. ఆయన ఉండే పల్లెటూరు మన అగ్రహారం పక్కనే. పొద్దున్న అగ్రహారానికి ఒక పక్కా, మధ్యాహ్నం మరొక పక్కా ఉన్న చిన్న చిన్న ఊర్లు చూసుకుని వెళుతూ ఉంటారు. ఆయన సువేగా శబ్దం వినబడటంతోనే ఊరిలో హడావుడిమొదలవుతుంది. ఆయన ఇచ్చే ఆయుర్వేదం, ఉమాపతీ (హోమియోపతీ) మందులన్నా, ఆయన హస్తవాసి అన్నా అందరికీ పెద్ద నమ్మకం. డాక్టర్ కాత్యాయనమ్మ లాంటి వారు పుట్టక ముందునించీ ఆయన మందులిస్తూనే ఉన్నారు, వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయ్యి, హాస్పటళ్ళు కట్టినా సరే ఆయన ప్రాభవం ఒక్కింత కూడా తగ్గలేదు అనే చెప్పాలి. కత్తి అవసరం అయితే (ఆపరేషన్) తప్ప జనం పెద్దగా హాస్పటల్‌కి వెళ్ళరు. ఆయన కూడా వయసు మీద పడుతున్నా సరే అందరి ఇళ్ళకీ ఓపికగా వెళ్ళి చూస్తూనే ఉంటారు. వారింట్లో గత మూడు తరాలుగా ఆ యుర్వేదాన్ని అవపోసన పట్టిన వారే.

అగ్రహారం మొగలోనే ఆయన వచ్చేది తెలియగానే సందడి మొదలవుతుంది.

" వీధిలో నిల్చోరా! అవధానులుగారు వెళ్ళిపోతారేమో!" అని పిల్లల్ని హడావుడి పెడతారు పెద్దవాళ్ళు. వాళ్ళేమో వీధిలోనూ, అరుగుల మీదా నిల్చుని చూస్తూ ఉంటారు ఆయన కోసం. అవధానులు గారు గంటకి పదో, మహా అయితే పన్నెండో కిలోమీటర్ల వేగంతో బండి నడుపుతారు కనక ఆయనని పట్టుకోవడమూ కష్టం కాదు, ఆపడం అంతకంటే కష్టం కాదు. అదీ కాక ఆయన ప్రతీ

ఊరిలోనూ క్రమం తప్పకుండా చూసే ఇళ్ళు కొన్ని ఉంటాయి, వారిళ్ళకొచ్చినప్పుడు ఆయన తప్పకుండా ఆగి, దిగి చూసి వెళతారు. అయినా సరే డాక్టర్ అంటే అదో రకమైన గౌరవం, ఆత్రం.

మెల్లిగా నడిపే తన బండిని జాగ్రత్తగా ఆపి, ఒకటికి నాలుగు సార్లు తాళం సరి చూసి రెండు పెద్ద ఖాకీ రంగు సంచీలూ, ఒక మబ్బు రంగు సంచీ తీసుకుని ఇంట్లోకి వస్తారు. వచ్చే ముందు చెప్పులు విధిగా గుమ్మం బయట వదులుతారు. ఆయన లోపలకి రాగానే అందరూ చేరతారు. పిల్లలేమో అతని చుట్టూ చేరి నిలుచుని చూస్తూ ఉంటారు ఆయన వెళ్ళేటప్పుడు తమ నోట్లో వేసే తియ్యమాత్రలకోసం. ఇంట్లో నిజంగా బావులేనివారూ, డాక్టర్ని చూడగానే తమ వొంట్లో బాగోలేదని గుర్తుకు తెచ్చుకుని మరీ చెప్పేవారూ తయ్యారుగా ఉంటారు. ఆడవాళ్ళు నట్టింటి గుమ్మంలో నించుని " నిన్నటినించీ కాళ్ళన్నీ ఒకటే పోట్లని చెప్పవే " అని పిల్లనో,

" పొద్దున్నించీ తల పడిపోతోంది ఈ మాయదారి తలపోటుతో" అని పిల్లాడితోనో చెప్తారు.

ఖళ్ళు ఖళ్ళు మంటూ దగ్గుతూ వచ్చిన పెద్దావిడేమో,

" మరే అవధానులు గారూ! ఈ దిక్కుమాలిన దగ్గు ఓ పట్టాన వదలడం లేదండీ నన్ను. పీల్చి పిప్పు చేసేస్తోంది బొత్తిగానూ" అంటారు.

ఆయన అందరి విషయాలూ ఓపికగా వింటారు. నిదానంగా మాట్లాడతారు.. ఆయన మాట్లాడే పద్ధతి గొప్పగా ఉంటుంది.

" ముక్కు దిబ్బడేసి మూసుకుపోయిందండీ" అంటే

" అవును మరీ, నాడి వాతాన కొట్టుకుంటుంటే ముక్కు మూసుకుపోక ఏమవుతుందీ? ఏం పొద్దున్నే సీతాఫలంపళ్ళేమైనా పడేసారేమిటి పొట్టలో పడి ఉంటాయని? లేక మంచులో ఊరేగారా? " అంటారు.

" మా చిన్నాడికి నిన్నటినించీ ఒకటే కడుపు నొప్పండీ? విలవిలలాడి పోతున్నాడు" అంటే. "మందు ఇస్తాను కానీ ఏరా? ఎర్రగా బావుంది కదా అని కొత్తావకాయ లాగించావా? " అంటారు.

" ఉండండి. ముందు జ్వరం వచ్చిన పిల్లని చూద్దాం" అని లోపలకి నడుస్తారు.

" ఏమ్మా ఎలా ఉందేం?" అంటారు. ఆ పిల్ల నీరసంగా నవ్వుతుంది.

వాళ్ళ అమ్మేమో " నువ్వు గింజ వేస్తే పేలిపోయేలా ఉందండి. ఉండుండి ఒకటే పలవరింతలూ". అంటుంది.

" కొంచం వేడినీళ్ళు పెట్టండమ్మా" , చేతికింద థర్మామీటర్ పెట్టి కళ్ళూ, నాడీ చూస్తూ అనగానే జ్వరంతో ఉన్న పిల్లకి గుండెల్లో రాయి పడుతుంది. వేడి నీళ్ళు ఎందుకో అందరికీ తెలుసు. అప్పుడు తీస్తారు చిన్న తెల్లటి స్టీల్ డబ్బా, దాంట్లో ఉంటుంది సిరింజ్. బాగా మరిగిన వేడినీళ్ళల్లో సూది పడేసి రెండు నిమిషాల తర్వాత తీసి, సిరెంజ్ లోకి కూడా వేడి నీళ్ళు ఎక్కించి ఒకసారి బయటకి వదులుతారు, అది చూడటానికి పిల్లలకి ఎంతో సరదా. తరవాత మందు ఎక్కించి మాటల్లో పెట్టి ఇంజెక్షన్ చేస్తారు. ఇది ఈ మధ్యన కొత్తగా నేర్చుకున్నారు ఆయన. నీరసం తగ్గడానికి ఆయుర్వేదం మందు ఇస్తూనే జ్వరం తగ్గడానికి ఇంగ్లీష్ మందుబిళ్ళ ఒకటి దాని మీద తగరపు కాగితం చింపేసి చిన్న కాగితంలో పొట్లం కట్టి మరీ ఇస్తారు.

" పథ్యమేమయినా పెట్టమంటారా? " అంటే మరే

" రొట్టే, పాలూ ఇవ్వండి. రేపు జ్వరం తగ్గితే అన్నం పెట్టండి, చారూ అన్నమే. తిన్నాకా పడుక్కోకూడదు" అంటారు.

తరవాత వరసగా కాళ్ళనొప్పులకీ, కడుపు నొప్పులకీ, దగ్గూ, జలుబులకీ వరసగా మందులు ఇస్తారు. ఆయన తనతో రకరకాల రంగుల పొడులు చిన్న చిన్న పొట్లాలుగా కట్టినవి తేనెతోనో, పటికెబెల్లం పొడితోనో కలిపి పుచ్చుకోమని చెప్తారు.

ఈ లోపున ఆయనకి కాఫీనో, కొబ్బరినీళ్ళో లేకపోతే చక్కెరనీళ్ళో కలిపిస్తారు. ఇవన్నీ పూర్తి అయ్యేసరికి దాదాపు ఒక గంటో ఇంకా ఎక్కువో పడుతుంది.

" మళ్ళీ రేపు వస్తాను కదా అప్పుడు చూద్దాం లెండి" అని బయల్దేరుతూ గుమ్మంలో కాచుకుని కూర్చున్న పిల్లలందరికీ నోట్లో తలో నాలుగు ఉత్త చక్కెర మాత్రలు వేసి, వాళ్ళు చిరునవ్వులతో చప్పరిస్తూ ఉంటే నవ్వుకుంటూ వెళతారు. ఆయన అలవాటుగావెళ్ళే ఇళ్ళన్నింటిలోనూ దాదాపుగా జరిగేతతంగమే ఇది.

ఎవ్వరినీ ఎప్పుడు ఇంత ఇవ్వమని అడగరు, అలా చేస్తే మందు పని చెయ్యదని వాళ్ళ నాన్నగారు చెప్పారుట. నెలకో పది రూపాయలు ఇచ్చినా తీసుకుంటారు, డబ్బుగా కాక వస్తురూపంలో ఇచ్చినా వద్దనరు. 'వైద్యం చేయించుకుని బాగుపడినవారు సంతోషంగా ఏది ఇస్తే పుచ్చుకోవాలిగానీ, ఎప్పుడూ అడగకూడదు. నాన్నా! 'అని చెప్పారుట వాళ్ళ నాన్నగారు. ఆ మాటకే కట్టుబడే ఇన్నేళ్ళుగా వైద్యం చేస్తున్నారు ఆయన. ఆయనేకాదు, గత మూడు తరాలుగా వారింట్లో అదే పద్ధతి.

అవధానులుగారికి ఒక్కడే కొడుకు, నలుగురు కూతుళ్ళు. వారి అబ్బాయి భీమశంకరానికి ఒక్కర్తే కూతురు జ్యోతి. తెల్లగా, సన్నగా చిదిమితే దీపం పెట్టుకోవచ్చు అన్నట్టుగా ఉంటుంది జ్యోతి. గుంటూరులో డాక్టర్ కోర్స్ చదువుతోంది. అది పూర్తి అయ్యాకా ఎలాగైనా కాత్యాయనమ్మ దగ్గర పని చెయ్యాలని ఆ అమ్మాయి కోరిక. సెలవలకి ఇంటికి వచ్చింది ఇప్పుడు.

దీపాలలాంటి కళ్ళతో, బోసి నవ్వులతో రబ్బరు బొమ్మలా ఉన్న చంటిపిల్లని చూసి, " మన ఇంటి దీపం రా! పాపపేరు జ్యోతి అని పెడదాం" అనేసారు.. ఆ పేరే స్థిరపడిపోయింది.

జ్యోతికి తాతగారంటే తగని ప్రేమ. చిన్నప్పటినించీ అమ్మా నాన్నలకంటే ఆయన దగ్గరే ఎక్కువ చనువూ, గారం. ఆయన పెట్టిన గోరు ముద్దలు తినీ, చెప్పిన చిట్టీ పొట్టి కథలు వినీ పెరిగింది. ఆయన కూడా జ్యోతికి సెలవలు ఎప్పుడు వస్తాయా? అని ఎదురు చూస్తూ ఉంటారు. ఆఖరి సంవత్సరం అయిపోయి, హౌస్ సర్జన్ గా చేస్తున్న జ్యోతి రాగానే కొండంత ఉత్సాహం పెల్లుబికింది - ఆయనలో.

జ్యోతి తండ్రికి ఆయుర్వేదంలో ఆసక్తి లేదు, ' ఇలా ఇంటింటికీ తిరిగీ ఊరికే వైద్యం చేసే ఓపిక తనకి లేదు, తను ఉద్యోగం చూసుకుంటానని' చెప్పినప్పుడు ఆయన చాలా నిరాశ చెందారు. కొడుకు మనసు బాధ పెట్టడం ఇష్టం లేక పైకి ఏమీ అనలేదు కానీ మూడు తరాలుగా వస్తున్న ఈ వైద్యం తనతోటే అంతం అయిపోతుందేమో? అని బాధపడ్డారు. కాత్యాయనమ్మ లాంటి డాక్టర్లన్ని చూసి ఎంతో మురిసిపోయేవారు. ' చిన్నపిల్లలైనా ఎంత నేర్పుగా వైద్యంచేస్తున్నారో? ఎంత పేరో? తన దిష్టే తగులుతుందేమో' అనుక్కునేవారు.

అంతేకాదు.. ఆధునిక వైద్యాన్ని చూసినప్పటినించీ ఆయనకి మరొక అసంతృప్తి మొదలయింది. 'తనేదో చెట్టు బెరడ్లూ, ఆకులూ, అలములూ నూరి పొడులూ, లేపనాలు చేసి ఇస్తే చిన్నా చితకా జబ్బులు తగ్గుతాయి. కానీ ఓ ఇంజెక్షన్ చెయ్యగలడా? - ఆపరేషన్ చెయ్యగలడా? అవసరం అయితే ఓ ప్రాణాన్ని కాపాడగలడా' అని. అందుకే పట్టుదలగా ఆర్.ఎం.పీ కోర్స్ చేసారు. దానివల్ల కొద్దిగా ఇంగ్లీష్ మందులివ్వడమూ, ఇంజక్షన్లు చెయ్యడమూ వచ్చింది.

'జ్యోతి డాక్టర్ చదువుతాను 'అనగానే చెట్టెక్కినంత సంబరపడిపోయారు.

" చూసావురా! రక్తంలో ఉన్నది ఎక్కడికి పోతుంది? నా లెక్కెందుకో నీ విషయంలో తప్పింది కానీ నా బంగారు తల్లి విషయంలో తిరిగి వచ్చింది చూసావా? " అని మురిసిపోయారు.

అప్పటినించీ జ్యోతి అంటే ఆయన కున్న ప్రేమ రెండింతలయింది.

ఆ పిల్ల వచ్చినప్పటినించీ వెళ్ళేదాకా క్షణం వదలకుండా వెనకే తిరుగుతూ " డాక్టర్ కోర్స్ ఎలా ఉంటుందో? కాలేజీ, లెక్చ్చరర్లూ అదీ ఎలా ఉంటారో? లాబ్‌లు ఎలా ఉంటాయో? " అంటూ రకరకాల ప్రశ్నలు వేసి అడిగి తెలుసుకునేవారు.

" రాగానే మొదలెట్టారా? ద్దాన్నో రెండు ముద్దలు తిననిస్తారా?" అని ఆయన భార్య కోప్పడితే.

" నాకూ తెలుసులే ఆ మాత్రం!. నువ్వు తినేసాకా పెరట్లో మంచం మీద కూర్చుని కబుర్లు చెప్పుకుందాం, అప్పటికి మీ నానమ్మ పడుక్కుంటుంది లే " అని రహస్యంగా అంటే జ్యోతి కిలా కిలా నవ్వుతుంది.

అప్పుడు మొదలయిన తాతా మనవరాళ్ళ కబుర్లు కొబ్బరాకుల మాటున చందమామ వెలుగులో ఎప్పటివరకో నడుస్తూనే ఉంటాయి. మధ్యలో అనసూయమ్మగారు మంచినీళ్ళకో, వాకిట్లోకి వెళ్ళడానికో లేచి కోప్పడితే కానీ ఆగవు.

అంత అర్ధరాత్రి దాటాకా పడుకున్నా సరే తెల్లవారుఝామునే నిద్ర లేచి, తయారై రకరకాల పొడి మందులూ, లేహ్యాలూ స్వయంగా నూరుకుంటారు. మర్దనాకి అదీ కావలసిన నూనెలు తనే దగ్గరుండి కాచి వడగట్టి తయారుగా ఉంచుకుంటారు. ఆ కార్యక్రమం జ్యోతి నిద్ర లేచేవరకూ కొనసాగుతుంది. "ఎందుకు తాతగారూ ఇంత కష్టపడతారు? ఎవరినైనా చెయ్యమనవచ్చు కదా" అంటే..

"అబ్బే కుదరదమ్మా! నా చేత్తో ఇస్తేనే నాకు తృప్తి. అంటూ అయినా నువ్వు చదివే చదువు ముందు ఈ పల్లెటూరి ముసలాడి మందూ ఒక మందేనా? " అంటారు.

"అలా అంటారేం తాతగారూ? ఎప్పటికీ తగ్గని ఆయాసంతో ఎన్నో ఏళ్ళు బాధపడ్డ శర్మ గారి ఉబ్బసాన్ని పూర్తిగా మటుమాయమయ్యేలా తగ్గించింది ఎవరు? మీరు కాదూ?

రాజేశ్వరమ్మగారికి వంటి మీద వచ్చిన దురదా, ఎలర్జీలు మళ్ళీ రాకుండా పారిపోయేలా చేసింది మీరు కాదూ..? " అంటుంది. ఆ మాటతో ఆ యనకి ఉత్సాహం పెల్లుబుకి

"అంతేనటమ్మా! సూర్యం గారి చంటివాడికి కోరింత దగ్గు కూడా మన మందు వల్లే తగ్గింది కదూ". అంటారు.

"మరి ఇంకేం?" అంటుంది జ్యోతి.

"అవుననుకో, అటుకుల పులిహార తింటూ అన్నారు. కానీ ఒక్క ఆపరేషన్ అయినా చెయ్యని వాడేం డాక్టరమ్మా? మీ నాన్నా, నాన్నమ్మా కలిసి ఇంత వయసు వచ్చినా ఇంకా ఎంతకాలం రోడ్లు పట్టుకు తిరుగుతారు? హాయిగా నీడ పట్టున ఉండకుండా? అంటారు.. వాళ్ళకేం తెలుసులే? మనకోసం పొద్దు పొడిస్తే ఎంతమంది కాచుకుని ఉంటారో? నువ్వు నేర్చుకున్నాకా, నాకూ నేర్పిస్తావా ఆపరేషన్ చెయ్యడం, అసలు చరకుడు, శుశ్రుతుడు వీళ్ళు అప్పుడే చేసారుట. ఏం? నువ్వు నేర్పిస్తే మనిద్దరం కలిసిచేసేద్దాం". అన్నారు. జ్యోతి నవ్వింది.

"ఇంక అది వదిలెయ్యి నాన్నా, దాని వైద్యం వేరు, నీది వేరు అన్నీ తెలిసినవాడివి ఇలా చిన్నపిల్లాడిలా మాట్లాడుతావు? " అని కొడుకు అంటే

"పోనీ నువ్వు డాక్టరీ మొదలు పెట్టాకా ఆపరేషన్ చేసేటప్పుడు నన్ను కత్తులూ అవీ అందించేవాడిగా పెట్టుకో, అలాగైనా ఒక ఆపరేషన్ చూసినవాడినవుతాను" అన్నారు రహస్యంగా. వెన్నెల విరిసినట్టు నవ్వింది జ్యోతి.

"హాయిగా వాడు విశ్రాంతి తీసుకోమంటే వినకుండా పైగా ఇప్పుడు కొత్తగా నేర్చుకోవడం ఒకటే తక్కువ అయింది మీకు" అని అనసూయమ్మగారు వెక్కిరించింది.

"పోనీలే నానమ్మా, ఈ కొత్తవన్నీ ఈ మధ్యన వచ్చినవే కదా, ఇంతవరకూ తాతగారే కదా అందరికీ దేవుడిలా ఆదుకున్నది. తాతగారినేమీ అనకు" అంది.

"అలా చెప్పమ్మా, పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదని,ఇన్ని ఊర్లకి కనిపించిన మన గొప్పతనం మీ నాన్నమ్మకి కనిపించదు". అన్నారు

"అదే. ఈగ వాలనివ్వవు ఆయన మీద. ఈ మూలికా, మందు అనుకుంటూ చెట్లంపటా, పుట్టలంపటా ముప్పొద్దులూ తిరుగుతూ ఉంటే ఆయన ఆరోగ్యం ఏమవుతుంది? నువ్వే చెప్పాలి తల్లీ, మా మాట వినే రకం కాదు మీ తాత". అందావిడ. పెద్దవయసు వస్తోంది, ఇంకా ఏం తిరుగుతారు? అని ఇంట్లో వాళ్ళు చెప్పడమూ, ఆ యన దానిని పెడచెవిని పెట్టడమూ ఎన్నో ఏళ్ళుగా నడుస్తూనే ఉంది.

జ్యోతి హౌస్ సర్జన్ పూర్తి అయింది వచ్చే సంవత్సరం. డాక్టర్ కాత్యాయని గారి దగ్గర జూనియర్‌గా చేరింది. కొన్నాళ్ళు నేర్చుకున్నాకా ఇంకా పైన చదవాలని అనుకుంటున్నానని అంది.

ఇంక అవధానులగారి హడావుడి చూడాలి.. రోజూ మనవరాలిని తన సువేగా మీదే దింపేసి, అడిగినవారికీ, లేనివారికీ కూడా తన మనవరాలు 'ఎలా డాక్టర్ అయిపోయిందీ, కాత్యాయనమ్మ ఎలా మెచ్చుకుందీ?' వగైరాలన్నీ చెప్పేసేవారు. జ్యోతి ఎంతో చురుకుగా అందుకొంది. రెండు నెలలలోనే అన్నీ చక్కగా చేసేది.

"'జ్యోతి నాకు ఇలా ఇంత తొందరగా కుడిచెయ్యిగా మారిపోతుంది అనుకోలేదు బాబాయ్ గారూ, ఈ క్షణాన దానికి ఆ సుపత్రి రాసిచ్చేసి ఎక్కడికైనా వెళ్ళిపోవాలని ఉంది. నా హాస్పటల్ని చక్కగా జ్యోతి చూసుకోగలదన్న నమ్మకం నాకొచ్చేసింది. ఇలాగే ఒక ఏడాది పనిచేసిందంటే నన్ను మించిన సర్జనూ, డాక్టరూ అయిపోతుంది కూడా" అని కాత్యాయని అన్నప్పుడు ఆయన మొహం మతాబాలా వెలిగిపోయింది.

"నిజమా అమ్మాయ్ ! మా వంశంలోనే ఉంది అది. పైగా నీలాంటి బంగారు తల్లి శిక్షణా? ఊరికే పోతుందా? " ఆ రోజు గడియారం స్థంభం దగ్గర ఉన్న మిఠాయి కొట్టులోంచి లడ్డూలు, తాపేశ్వరం కాజాలూ కొనుక్కెళ్ళి ఊరందరికీ పంచిపెట్టారు.

ఏదో అత్యవసరమైన పని పడి డాక్టర్ కాత్యాయని రెండు రోజులు వెళ్ళవలసి వచ్చింది. మరీ పెద్ద కేసులేమీ లేవు కనక మాములు పేషంట్లని జ్యోతి చూసుకోగలదు అని ధైర్యం ఉండటం వల్ల ఆసుపత్రి మూసేయవలసిన అవసరం రాలేదు. పైకి ధైర్యంగానే ఉన్నా లోపల కొంచం భయపడింది జ్యోతి. అవధానులు గారు బోల్డంత ధైర్యం చెప్పేసారు. రెండు రోజులు తన పనులన్నీ మానేసుకుని ఆ ఆసుపత్రిలోనే మకాం పెట్టేసారు.

మొదటి రోజు మాములు దగ్గూ, జలుబూ లాంటి కేసులే వచ్చాయి కనక పరవాలేక పోయింది జ్యోతికి.

రెండో రోజు సాయంత్రం జరిగిందా సంఘటన. చేత్తో పొట్ట పట్టుకుని మెలికలు తిరిగిపోతున్న బంగారాజుని నలుగురు మనుషులు చేతులమీద మోసుకు తీసుకొచ్చారు.

"జ్యోతమ్మా, చూడండమ్మా! అంటూ. అతన్ని చూడగానే అర్థం అయింది జ్యోతికి అది అపెండిసైటిస్ అనీ, ఆగడానికి వీల్లేని పరిస్థితి అని. కానీ తను ఒక్కర్తీ స్వతంత్రంగా ఆపరేషన్ చెయ్యడానికి ధైర్యం సరిపోలేదు. ఏదైనా జరగరానిది జరిగితే తన మాట అలా ఉంచి కాత్యానమ్మగారికెంత చెడ్డపేరు? కానీ ఎలా ఊరుకోవడం? మనిషిని చూస్తే మెలికలు తిరిగిపోతున్నాడు. ఆలస్యం చేస్తే ఏమవుతుందో అని ఒక పక్కా, సాహసించి చేసేయడమా? అని ఇంకో పక్కా ఊగిసలాడుతోంది.

" ఇంకెవ్వరూ పేషంట్లు లేరుకదా! సినిమాకెళదామనుకున్నాం, ఈ రోజు తొందరగా వెళ్ళనా? " అంటే నర్స్ ని కూడా ఇప్పుడే పంపించేసింది.

వార్డ్ బాయ్, తనూ తప్ప ఎవరూ లేరు.

ఇంతలో అక్కడకి వచ్చిన అవధానులు గారు "దీనికింత ఆ లోచనేమిటమ్మా? చేసెయ్యి.. లేకపోతే పాపం బ్రతికేలా లేడు.

నువ్వు డాక్టరీ చదివేసావు కదా, కావాలంటే కత్తీ, సూదీ, దారం నేను ఇస్తాలే "అన్నారు.

జ్యోతికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. " అది కాదు తాతగారూ, ఆపరేషనంటేమాటలు కాదు కదా, పెద్ద డాక్టర్ గారు దగ్గరుండగా నేను చేస్తే వేరు, ఇది అలా కాదు కదా.. " అంది.

" పరవాలేదమ్మా, నీకొచ్చుకదా, నేనున్నాను కదా.. ఎప్పుడో ఒకప్పుడు మొదలు పెట్టాలి కదా, అది ఇప్పుడే అనుకో, ధైర్యే, సాహసే అన్నారు.. " అన్నారు.

కాత్యాయనిగారికి కబురు పెట్టి రమ్మనేంత వ్యవధి లేదు. ఆవిడ వెళ్ళిన చోట ఫోన్ లేదు.. ఇంక వేరే దారి లేని పరిస్థితుల్లో ధైర్యం చేసి తాతగారు చెప్పినట్టు ఆయన కత్తులూ, ఇతర సామానులూ అందిస్తే కొద్దిగా వణుకుతున్న చేతులతో అయినా సరే ధైర్యంగా, చాకచక్యంగా ఆపరేషన్ చేసి అపెండిక్స్ తీసేసి బంగార్రాజుని కాపాడింది.

మనవరాలు ఎంతో అనుభవం ఉన్నదానిలా ఆపరేషన్ చెయ్యడమూ, కుట్లు వెయ్యడమూ అదీ చూసి ముగ్ధులైపోయారు అవధానులుగారు. రోగికి తెలివి వచ్చి మనుషులని గుర్తుపట్టేవరకూ అక్కడే ఉండి పోయారు తాతా మనవరాలూ.

"పోనీలేమ్మా, బంగార్రాజు ధర్మమా అని నా ఆపరేషన్ కోరిక తీరిపోయింది. నేను చెయ్యకపోయినా నువ్వు చేస్తుంటే చూసాను .. చాలు ఎంతయినా కొత్త విధానాలూ, వైద్యాలు, వాటి తీరే వేరు. నైనేతే ఏ అజీర్ణమో చేసుంటుందేమో అనుకునేవాడినేమో" అన్నారు నవ్వుతూ.

బంగార్రాజుకి తగ్గాకా అప్పుడొచ్చారు ఇద్దరూ ఇంటికి.అంత రాత్రి వచ్చినా సరే మర్నాడు మళ్ళీ తన సమయానికి లేచి మందులూ అవి నూరుకుంటున్న తాతగారిని చూసి అడిగింది.

"తాతగారూ ఆపరేషన్ అయ్యాక ఇంక తిరగను, మానేస్తాను అన్నారు కదా. మళ్ళీ ఈ నూరే కార్యక్రమం మొదలెట్టారేం? పైగా నేను చేసేదానిముందు మీదేపాటి అన్నారు? "అంది వెక్కిరింతగా.

"అన్నానా? మీ నాన్నా, నాన్నమ్మల పోరు పడలేకో, నువ్వు చేసే ఆపరేషన్ కళ్ళారా చూడాలనో అనే ఉంటాను..

కానీ ఇది లేకుండా ఉండగలనా? మీ కొత్త డాక్టర్లు కత్తీ, కటార్లతో ప్రాణదానం చేసి జీవన వేదాన్ని పలికిస్తే మా బోటి వాళ్ళు - ఆకులూ,మూలికలూ కలిపి పలికించే వేదమే ఆయుర్వేదం. వేదవ్యాసుడు రాసిన మహాభారతం ఐదో వేదమైతే, ఏనాడో మన పూర్వీకులూ, పెద్దవాళ్ళు కనిపెట్టిన ఆరో వేదమమ్మా ఈ ఆయుర్వేదం. మీ తాతా, ఇదీ వేరు కాదు.. ఒకటే.. ఒకరు లేక ఇంకొకరు లేరు.. ఉండలేరు.. అన్నారు. అవన్నీ అలా ఉంచు.. మీరేకాదండి. మేమూ డాక్టర్లమే.. మా కోసమూ ఎదురుచూసే పేషెంట్లు ఉన్నారు" మిలమిలా మెరిసే జ్యోతి కళ్ళల్లోకి మురిపెంగా చూస్తూ అన్నారు.

**NEW**
Click here to share your comments on this story